# గుణ

ఎస్వీ కృష్ణజయంతి

"నమస్తే సార్...!"

లంచ్ అవర్‌లో సీట్లోంచి లేచి క్యాంటీన్ వైపు వెళ్లబోతున్న రమణ తిరిగి చూశాడు. పోస్ట్‌మేన్ రామారావు! "మీకో క్యాష్ కవరొచ్చింది సార్..." సంతోషంగా చెబ్తూ దగ్గరి కొచ్చాడు.

క్యాష్ కవరా...?" అంటూ నవ్వాడు రమణ. అచ్చయిన తన కథలకి పత్రికలవాళ్లు పంపించే 'రెమ్యూనరేషన్'ని మోసుకుంటూ వచ్చే కవర్లు అతడి పరిభాషలో 'క్యాష్' కవర్లు...!

సంతకం పెట్టి, "ఊఁ... ఇటివ్వు..."అంటూ కవర్ కోసం చేయి చాచాడు రమణ.

"ఇంకో సంతకం చేయండి సార్...!"

"ఇంకోటా...? ఎందుకూ...?" ఆశ్చర్యంగా అడిగాడు రమణ.

"రెండో కవర్‌కి సంతకం చేయాలి కదా సార్...!"

"ఏంటీ...క్యాష్ కవర్లు రెండొచ్చాయా?" అన్నాడు సంతకం చేస్తూ.

"కాద్సార్...క్యాష్ కవర్ ఒకటే...! రెండోది మామూలు రిజిస్టర్డ్ కవర్! ఎక్కడ్నుంచంటే..."అంటూ కట్టలోంచి కవర్లు బయటకి తీశాడు.

"సర్సరే...ఇటివ్వు!' వాటిని అందుకొని, అతడి చేతిలో ఓ ఐదు రూపాయలు పెట్టి వెనక్కి తిరిగాడు రమణ. ఇలా రెమ్యూనరేషన్ వచ్చినప్పుడల్లా రామారావుకి ఐదో, పదో 'టిప్'గా ఇవ్వడం రమణకి రివాజు.

'పత్రికల నుంచి తిరిగొచ్చే కథలు రిజిస్టర్డ్ పోస్ట్‌లో కదా...మరి ఎక్కడి నుంచై ఉండొచ్చూ...' అనుకుంటూ నడుస్తూనే చేతిలోని 'రెండో కవర్' వంక చూడబోయేంతలో...

"రమణా...నిన్న సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికెళ్తుంటే ఏం జరిగిందో తెలుసా..." అంటూ తన పక్క సీట్లోని సుబ్బారావు వచ్చాడు దగ్గరికి. 'ఏం జరిగింది?' అని తను అడగకపోయినా-

"పద...క్యాంటీన్‌లో కూర్చొని డిటెయిల్డ్‌గా మాట్లాడుకుందాం!" అంటూ తనతోపాటు సుబ్బారావు కూడా బయల్దేరేసరికి-చేతిలోని కవర్లని ప్యాంట్‌జేబులోకి తోసేశాడు రమణ.

క్యాంటీన్‌లో కూర్చున్నాక సుబ్బారావు ఏదేదో మాట్లాడుతున్నా...రమణ ధ్యాస మాత్రం తన జేబులోని ఆ 'రెండో' కవర్ మీదే ఉండిపోయింది.

'ఎవరు రాసి ఉంటారు?'... ఎంత ఆలోచించినా అతడికి స్ఫురించలేదు.

'ఒకవేళ...అభిమాని ఎవరైనా తన కథను రాయమంటూ పంపించిందేమో...!'

ఎందుకో...ఆ ఆలోచన రాగానే రమణ ముఖంలో ఓ చిన్న చిరునవ్వు తళుక్కున మెరిసింది.

'కథా రచయితగా'గా తెలుగు పాఠకులలో అతడికి మంచి 'పాపులారిటీ' ఉన్న కారణంగా అభిమానుల నుంచి అప్పుడప్పుడు అలాంటి ఉత్తరాలూ, విజ్ఞప్తులూ అందుకున్న సందర్భాలు కూడా లేకపోలేదు.

క్యాంటీన్ నుంచి వచ్చి తిరిగి తన సీట్లో కూర్చున్నాక..పెండింగ్ వర్క్‌క్లియర్ చేయడంలో పూర్తిగా మునిగిపోవడం వల్ల కాసేపటికి



రమణ ఆ 'రెండోకవర్' సంగతే మర్చిపోయాడు.

000

రమణ వయసు నలభై దాటి ఉంటుంది.

కాని...అతడి గురించి తెలియనివాళ్లకీ, మొదటిసారి చూసినవాళ్లెవరికైనా 'అతడి వయసు ఇంత!' అని చెప్పినా నమ్మకం కుదర్దు. అలా ఉంటుందతడి 'మెయింటెనెన్స్...!'

ఎప్పుడు చూసినా 'మడత' నలగని ఇస్త్రీ బట్టల్లో నీట్‌గా ఉంటాడు. నుదురుకి పైన, కణలతకి దగ్గర చెవుల దగ్గరా బాగా దట్టంగానూ.., తలపైన అక్కడక్కడా నెరిసిన జుట్టుకి 'డై' వేసుకొని 'ట్రిమ్'గా కనిపిస్తాడు. మీసంలో ఒక్క తెల్లవెంట్రుక కూడా కనిపించకుండా మహా జాగ్రత్త పడుతూ...చూసేవాళ్లకి తన వయసు ఓ పదేళ్లు తక్కువగా అన్పించేట్లు మెయిన్‌టెయిన్ చేస్తాడు.

చేసే వృత్తి...ఓ గవర్నమెంట్ ఆఫీసులో సాదాసీదా ఉద్యోగమే అయినా-ప్రవృత్తి మాత్రం...రచనా వ్యాసంగం! 'గుణ' అనే కలంపేరుతో అతడు రాసే కథలూ, నవలలూ మార్కెట్‌లో ఉన్న దాదాపు అన్ని తెలుగు పత్రికలలోనూ ఎడాపెడా అచ్చవుతూనే ఉంటాయ్. నిజానికి...'రమణ'గా కంటే 'గుణ'గానే అతడు చాలామందికి పరోక్షంగా తెలుసు. ఒక 'మంచి రచయిత'గా పాఠకుల దృష్టిలో గుర్తింపబడుతూ...స్త్రీల అభ్యుదయాన్ని ఆశించే 'గొప్ప రచయిత'గా ఎంతోమంది అభిమానుల హృదయాలలో ఓ స్థానాన్ని సంపాదించాడు.

ఆరోజు రమణ 'రూమ్'కి చేరుకునేసరికి సాయంత్రం ఆరున్నరయింది. 'వర్క్ లోడ్' ఎక్కువగా ఉండడం వల్ల ఆఫీసు నుంచి బయటపడేసరికి లేటయింది.

తాళం తెరిచి గదిలోకి అడుగు పెట్టగానే ఇటుపక్క గోడకి అతికించి ఉన్న పోస్టర్లలోని అర్ధనగ్నపు 'సమంతా ఫాక్స్,' ఎదురెదురుగా నించొని పెదవుల మీద ముద్దులు పెట్టుకుంటున్న ఇద్దరు చిన్నారులు...ప్రతిరోజులాగే ఆరోజు రమణని పలకరించలేకపోయారు. బాగా అలసిపోవడంతో లోపలికొస్తూనే ఫ్యాన్ స్విచ్ ఆన్ చేసి, వాలుకుర్చీలో కూర్చొని రిలాక్స్‌డ్‌గా వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాడు.

ఓ అరగంట తర్వాత...కుర్చీలోనే ఒకపక్కకి ఒత్తిగిలబోతూండగా-ప్యాంట్‌జేబులోంచి ఏదో గరగరమని విన్పించింది. అప్పుడు గుర్తొచ్చింది...మధ్యాహ్నం పోస్ట్‌మేన్ తెచ్చిచ్చిన కవర్లు.

వెంటనే వాటిని బయటకి తీశాడు. ఆసక్తిగా ఆ రెండో కవర్ వంక చూశాడు.

దాని మీదున్న 'ఫ్రమ్ అడ్రస్' చదవగానే...వాలుకుర్చీలో రిలాక్స్‌డ్‌గా కూర్చున్నవాడల్లా అప్రయత్నంగా ఎలర్ట్ అయ్యాడు. నిటారుగా కూర్చుంటూ మరోసారి చూశాడు అడ్రసు వంక.

...కృష్ణవేణి! మనో వినీలాకాశంలో ఒక్కసారిగా సంతోషపు మెరుపు మెరిసినట్లయింది రమణకి.

ఈ ప్రపంచంలోని అత్యంత అమూల్యమైన, అపురూపమైన వస్తువు దొరికినంత ఆనందం కలిగింది. ఆ అలౌకిక భావం లోంచి వెంటనే తేరుకోలేకపోయాడు.

కొన్నిక్షణాల తర్వాత...కవర్ చించి, లోపలున్న ఉత్తరాన్ని ఎంతో అపురూపంగా బయటకి తీశాడు. అప్రయత్నంగా దాన్ని తన పెదవులకి అద్దుకొని అలాగే ఉండిపోయాడు కొద్దిసేపు.

ఆ తర్వాత...ఉత్తరాన్ని విప్పి చదవనారంభించాడు.



"హలో... రచయిత 'గుణ' గారూ...నమస్తే...!

బాగున్నారా? ఉత్తరం ఎవర్నుంచి వచ్చిందో తెలీక తికమక పడ్తున్నారా? మీరు నన్ను మర్చి పోలేదనే అనుకుంటున్నాను. ఎందుకంటే...మగవాడు తాను చేసిన మంచిపనుల్ని ఎలా జీవితాంతం గుర్తుంచుకుంటాడో...అలాగే చేసిన 'చెడ్డ' పనుల్ని కూడా ఎన్నటికీ మర్చిపోడని నా నమ్మకం!

ఇంకా నేనెవరో మీకు తెలీలేదంటే...ఒక్కసారి ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లండి. ఇరవై సంవత్సరాల క్రితం నాటి 'గతం' గుర్తుతెచ్చుకోండి.

గుర్తొచ్చానా...?ఎస్...గుర్తొచ్చే వుంటాను. మీరు రాసిన మొట్టమొదటి కవిత 'ఉషః కాంతి' నన్ను చూసి రాసిందే! ఆ రోజు నుండి ఈ రోజు వరకూ పది అక్షరాలున్న మీ అసలు పేరుని రెండక్షరాల 'గుణ' అనే కలంపేరుగా మార్చుకొని మీర్రాసిన కవితలూ, కథలూ, సీరియల్స్ చదుతూనే ఉన్నాను. నాకీ సాహిత్యాభిమానం మీ స్నేహం వల్లే అబ్బింది...కాదంటారా? ఎలా అనగలరు? మీకు గుర్తుండే వుంటుంది...'ఊహా సుందరి, నీవూ-నేనూ' కవితలు నేను ఫెయిలర్ చేశాకే కదా మీరు పత్రికలకు పంపించారు...ఆ తర్వాత చాలా రాశారనుకోండి!

అన్నట్లు-మీ 'ప్రేయసి' కవిత....నా కళ్లల్లో ఇప్పటికీ కదలాడుతూనే ఉంటుంది. ఎందుకంటే మీరూ ఆ కవిత నన్ను చూస్తూనే కదా అల్లిందీ...?!

'మన ఇద్దరి మధ్యా మౌనంగా ముచ్చట్లాడే చూపులు...
చప్పట్లవ్వాలనుకునే చెక్కిళ్లు...
అరవిచ్చిన అధరాలు..., అరమోడ్పు నయనాలు...
మనసుని హత్తుకుంటూ, మూగభాషలో అల్లుకుపోతూ...
తళుకున్న మెరిసే కళ్లూ...కనుపాపలు మంత్రించిన స్వప్నాలు...
అధరాలని అదిమి, మకరందం గ్రోలాలని
ఎన్నో ఆశలతో
ఎదురుచూస్తున్నాను...
రా ప్రియా...కృష్ణవేణీ జల తరంగ ప్రవాహమై!'

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం- ఏ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**


-ఇలాంటి కవితలు అప్పట్లో మీరు చాలా ఎక్కువగా రాసేవారు కదూ!

ఆ తర్వాత మనమధ్య మొలకెత్తిన 'ప్రేమ'ను 'అమర ప్రేమ' అనే కథగా మలచి 'ప్రేమకథా రచయిత'గా పాఠకులకు పరిచయమయ్యారు.

'ప్రేమ పిపాసి' కథలో నామీద మీకున్న ప్రేమను భరత్ పాత్ర ద్వారా వ్యక్తం చేసి, ఆ భరత్ పాత్ర మీదేనని నమ్మకంగా చెప్పారు. కులాంతర-మతాంతర వివాహాల గురించి..."కులమతాల్ని నిలువునా తగలేద్దాం...కట్నపిశాచిని తరిమికొడదాం!' అంటూ మీరురాసిన ఎన్నో కవితలు చదివి మీలో ఆదర్శం, తెగువా, సాహసం ఉన్నాయనుకున్నాను. మీ చేయి అందుకోవాలనుకున్నాను.

'ఆదర్శం' కథలో నన్ను ప్రేమించి, 'పెద్దలు కాదన్నా ఒకటవుతా'మంటూ నా కన్యత్వాన్ని దోచుకున్నప్పుడు అడ్డురాని కులం, అంతస్తూ-'పిరికివాడు' కథలో మన పెళ్లికి అడ్డొచ్చా కదూ?! ఆ పిరికితనాన్ని పాఠకులందరికీ నచ్చే చక్కని కథగా మలచగలగడం మీ సాహిత్య ప్రజ్ఞకి ఓ మచ్చుతునక.

వార, మాస పత్రికల్లో మీ కథలు అమాయక పాఠకులను అలరిస్తుండగా మీకు ఉద్యోగం రావడం వల్ల నానుంచి తప్పించుకున్నారు. సారీ...నా నుంచి పారిపోయారు.'



భర్తలూ...జాగ్రత్త!' కథలో కులం, అంతస్తూ, కట్నం చూసి మీరు కక్కుర్తిపడి పెళ్లిచేసుకున్న మీ ముద్దుల భార్య ఎదురింటి ఏసుపాదంతో లేచిపోయిన ఉదంతాన్ని అందమైన కథగా మలచగలగడం..., 'దేవుడా...నీవెక్కడ?' కథలో మీ రెండోభార్య కిరోసిన్ చావుని పాఠకలోకం మొత్తం కంటతడి పెట్టేట్లుగా కరుణార్ద్రంగా రాయగలగడం మీలోని సాహితీ చతురతే అనాలి. మీ రచనా సామర్థ్యానికి జోహార్లర్పించి తీరాలి.

'కన్నీరు' కథలో మీ పిల్లలు మీనుండి ఎలా దూరమయ్యారన్న సంగతినీ, కన్నకూతురే మిమ్మల్ని ఛీదరించుకున్న సందర్భాన్నీ...పాఠకుల హృదయాల్ని కదిలించేలా మీరు రాయగలగడం నిజంగా హర్షించదగ్గ విషయమే!

అన్నట్లూ...మీ అబ్బాయిని మీరే ఇంట్లోంచి తరిమేశారా? లేక మీ శాడిజం భరించలేక తనే ఇంట్లోంచి పారిపోయాడా?

ఇక, మీ అమ్మాయి సంగతి...

మీ షోకిల్లా వేసాలకే కాబోలు-మీ అమ్మాయి మీకు తగిన శాస్తి చేసింది. 'మైనార్టీ' కూడ తీరిందో లేదో పాపం...పసివయసులోనే ప్రేమించిన కుర్రాడితో 'వెళ్లిపోయింది.'

ఇకపోతే...రెండువారాల క్రితం ప్రింటయిన మీ 'ఆశ,' 'ఓయాసిస్'కథల్లో మీ మనసులోని విషయం బట్టబయలైంది. అందుకే...ఇన్నేళ్ల తర్వాత మళ్లీ మిమ్మల్ని నేనిలా పలకరించాల్సి వచ్చింది.

మీ మాజీ ప్రేయసి మళ్లీ మీ దగ్గరికి వస్తుందని ఎలా ఊహించారు?

ఆమె భర్త ఎందుకు చనిపోవాలి? ఒకవేళ...ఆమెకి వైధవ్యం కలిగినా-ఉన్న ఒక్క కూతురుతో మీ దగ్గరికి చేరుకుంటుందనే మీ ఆశ 'ఆశ'గానే మిగిలిపోతుంది 'గుణ'గారూ!

ఎందుకంటారా-మీరు కథలో రాసినట్లుగా ఒకవేళ నా భర్త చనిపోయినా మీ పంచకు చేరాల్సిన అవసరమూ, అగత్యమూ నాకు లేదు...రాదు. నేను డిగ్రీ పూర్తిచేయలేదని మీరింకా అనుకుంటున్నారంటే అది మీ పొరపాటే!

నేను చేసిన 'తప్పు' నేను తెలుసుకునేసరికి మీ నైజం ఏమిటో, మీ అసలు స్వరూప మేంటో పూర్తిగా అర్థమయింది. అప్పటికే మీ పెళ్లి జరిగిపోవడం, ఉద్యోగం వంకతో మీరు మా ఊరు దాటి 'పారిపోయారు.'

ఆ తర్వాత రెండుమూడుసార్లు ప్రయత్నించి ఎలాగోలా డిగ్రీ పూర్తయిందనిపించాను. వెంటనే ప్రైవేటుగా పి.జి. చేశాను. ఆపైన పి.హెచ్.డి. కూడా చేయడంలో మా శ్రీవారు ఎంతో సహకరించారు. ప్రస్తుతం లెక్చరర్‌గా ఇక్కడే ఓ కాలేజిలో పనిచేస్తున్నాను.

హలో...రమణగారూ...సారీ, గుణగారూ! నేను మీలా పిరికిదాన్ని కాదు. మీరు జ్ఞాపకాలు నెమరేసుకుంటూ కలల్లో, ఊహల్లో విహరిస్తారు...కానీ, మీలా గతాన్ని తల్చుకుంటూ బేలగా కూర్చోవడం నాకు అలవాటు లేదు.

'గుణ' పేరుతో ప్రింటయ్యే మీ కథలు ఏ పత్రికలో కనిపించినా చదవడం నాకలవాటు. మీరెలా ఉన్నారో, మీ జీవితం ఎలా సాగుతోందో మీ కథల ద్వారానే నాకర్థమౌతుంది. పాఠకులకు మీ కథల్లో కథనం, మీ రచనాశైలీ, శిల్పం, సాహిత్యం నచ్చవచ్చు.కానీ....నాకు మాత్రం వాటిలో మీ స్వభావం, వ్యక్తిత్వం, మీ భావాలూ, ఆలోచనలూ తెలుస్తుంటాయి. అందుకే మీకీ ఉత్తరం రాశాను. 'కులం' పెద్దయినా 'గుణం' అంతకంటే ముఖ్యం గుణగారూ!

జీవితంలో ఎదురయ్యే వ్యతిరేక పరిస్థితులకి తట్టుకుంటూ, వాటికి ఎదురీదుతూ జీవన పయనం సాగించే జీవి పేరే 'మనిషి'. టీనేజ్‌లో కోరికలని అదుపులో పెట్టుకోవడం ఎవ్వరికైనా కష్టమైన పనే! అది 'వయసు పోరు' అనుకున్నా, 'సృష్టి సహజం' అనుకున్నా..తప్పు చేయకుండా ఉండగలగడం ఇంకా గొప్ప.

మీనుంచి ఇంకా మంచి కథలు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. సమాజానికి పనికొచ్చేవి, యువతను జాగృతం చేసే జీవిత సత్యాలను చక్కని కథలుగా రాసి, సాహితీలోకంలో 'గుణ' మంచి రచయిత...అని పేరు తెచ్చుకోండి. జీవితాలు పంచుకోవడానికి కులమతాలు అడ్డొస్తాయేమో కాని, ప్రతిభా పాటవాలకు అవెప్పుడూ అడ్డురావు. ఆల్ ది బెస్ట్! సెలవా మరి!

'కృష్ణవేణి"

...ఉత్తరం చదవడం పూర్తిచేసిన రమణకి ఏదో అఘాతంలోకి జారిపోతున్నట్లనిపించి, కూర్చున్న కుర్చీలో అలాగే వెనక్కి వాలిపోయాడు